క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి

పాన్‌గల్: ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరగా నిర్మించుకుంటే బిల్లులు వెంటనే అందుతాయని ఎంపీడీఓ గోవింద్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని మాందాపూర్ గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి మంజూరైన 27 ఇళ్లలో 8 వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

గౌడ సంఘం కమిటీ ఎన్నిక



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ శివారులో దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మండల గౌడ సంఘం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, జిల్లా గౌడసంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాములుగౌడ్, మహాదేవన్‌గౌడ్ పాల్గొని కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా గుండ్రాతి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా ఏదుల నర్సింహగౌడ్, ఉపాధ్యక్షులుగా ఆనంద్‌గౌడ్, వెంకటన్నగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాఘవేందర్‌గౌడ్, కోశాధికారిగా భాస్కర్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్, గౌరవ సలహాదారులుగా రవీందర్‌గౌడ్, నాగరాజుగౌడ్, కమిటీలను సభ్యులను ఎన్నుకున్నారు.

మున్సిపల్ చైర్మన్‌గా బీసీలకు అవకాశం ఇవ్వాలి



వనపర్తిటౌన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపల్ చైర్మన్‌గా బీసీలకు అవకాశం ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎత్తం విష్ణు, నాయకులు చంద్రశేఖర్, రాజేష్, అమూల్య, రాము, అశోక్ తదితరులు పాల్గొన్నారు..

కమీషన్ పెంచాలని వినతి



వీపనగండ్ల: రేషన్ డీలర్లకు అందజేయాల్సిన కమీషన్ డబ్బులను వెంటనే విడుదల చెయ్యాలని కోరుతూ మంగళవారం మండలంలోని రేషన్ డీలర్లు తహసీల్దార్ వరలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. కమీషన్‌తో సంబంధం లేకుండా ప్రతినెలా రూ.30 వేల గౌరవ వేతనాన్ని అందజేయాలని మండల సంఘం అధ్యక్షుడు బసవరాజుగౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, దశరథంగౌడ్, కృష్ణారెడ్డి, వెంకటయ్యగౌడ్, రాజారెడ్డి, రాజేష్, యుగేందర్, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల్లో ఆంగ్లం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నరసింహ్మాగౌడ్‌ను కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు ఈ నెల 1న సస్పెండ్ చేసినట్లు డీఈఓ అబ్దుల్ ఘని చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల సమాచారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అతడిపై 21-04-24న పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదై జ్యుడిషియల్ విచారణ జరుగుతుందని, విచారణ ముగిసేవరకు అతడి సస్పెన్షన్‌లో కొనసాగుతాడని పేర్కొన్నారు.

బోనమెత్తిన పల్లెలు



వీపనగండ్లలో బోనాలతో వెళ్తున్న మహిళలు



అంకూరులో బోనమెత్తిన మహిళలు



పాన్‌గల్ : బుసిరెడ్డిపల్లిలో బోనాలతో మహిళలు



రంగాపురం గ్రామంలో బోనాలతో మహిళలు



మానాజీపేట గ్రామంలో బోనాల ఊరేగింపు

పాన్‌గల్: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మకు బోనాల నైవేద్యం సమర్పించారు.

వనపర్తి రూరల్: మండలంలోని అంకూరు, చిమనగుంటపల్లి, పెబ్బేరు మండలంలో రాంపురం, రంగాపురం, శ్రీరంగాపురంతో పాటు నాగరాల గ్రామాల్లో మంగళవారం పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. బోనపు కుండలతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో మంగళవారం బోనాల పండుగ ఉత్సవాలను మహిళలు ఘనంగా నిర్వహించారు.

మదనాపురం: మండలంలో మంగళవారం పో చమ్మ బోనాల పండుగను మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. దుప్పల్లి నిలివిడి నర్సింగాపురం కొన్నూరులో జరిగింది. ఉదయం నుంచి గ్రామాల్లో బోనాల పండుగ వాతావరణం కనిపించింది.



దుప్పల్లిలో ..

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పోచమ్మ బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని తిర్మలాయపల్లి, సల్కెలాపురం, మానాజీపేట, కమాలోద్దీన్‌పూర్ తదితర గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాల ఎదుట పూనకాలతో ఊగిపోయారు. గ్రామాల్లో బోనాల ముందు మహిళలు బొడ్డెమ్మ ఆడారు. ఆడపడుచులు గ్రామాలకు రావడంతో పండుగ శోభ కనిపించింది.



ఖిల్లాఘనపురం: సల్కెలాపురం గ్రామంలో ..

గణపయ్య పూజకు సిద్ధం



జిల్లా కేంద్రంలో పూజకు సిద్ధమైన వినాయకుడి మండపం

వనపర్తి : మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఆయన ప్రారంభించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈ యూనోస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్ రెడ్డి, మెప్మా అధికారి బాలరాజు పాల్గొన్నారు.

వీపనగండ్ల: గణేశ్ మండపాల ఏర్పాటులో నిర్వాహకులు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ఎస్ఐ రాణి అన్నారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో మండపాల ఏర్పాటు నిర్వాహకులతో జా గ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఖిల్లాఘనపురం: వినాయక మండపాల దగ్గర నిబంధనలను పాటించాలని కొత్తకోట సీఐ రాంబాబు తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలో పోలీ స్టేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై జయన్న పాల్గొన్నారు.

గోపాల్‌పేట: అందరూ మట్టివిగ్రహాలను వాడి పర్యావరణాన్ని రక్షించాల్సిన అవసరం ఉందని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయ అన్నారు. మంగళవారం విద్యార్థులతో కలిసి మట్టి వినాయకులను తయారుచేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రమాదేవి, సునీత, చెన్నపద్మ, ప్రవీణలక్ష్మి, మహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మట్టి వినాయకులతో పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుతుందని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్ ఎదురుగా మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఝాన్సీరెడ్డి, అనూష, మోహన్, కాషన్న, ముబ్బషీర్ పాల్గొన్నారు.

అమరచింత: ప్రతిఒక్కరూ మట్టివినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించడం ద్వారా పర్యావరణాన్ని రక్షించిన వ్యక్తులుగా ఉంటామని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. పురపాలిక కార్యాలయ ఆవరణలో ఉచితంగా విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలగోవింద్, మార్కెట్ డైరెక్టర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భూతాల బీఆర్ఎస్ వద్దు.. కన్నతల్లి లాంటి కాంగ్రెస్ ముద్దు

ఖిల్లాఘనపురం: భూతాల బీఆర్ఎస్ పార్టీ మనకు వద్దని పేద ప్రజలకు కన్నతల్లి లాంగ అండగా ఉండే కాంగ్రెస్ పార్టీ మాత్రమే ప్రజలందరికి ముద్దని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో రూ.1.90 కోట్లతో నిర్మించిన వేసైడ్ మార్కెట్‌ను జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనువాస్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. మార్కెట్‌లో పూవులు, కూరగాయాలు విక్రయిస్తున్న మహిళలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం 30 మందికి కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అదేవిదంగా 24 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీ ఖీమ్యానాయక్, జిల్లా మార్కెట్ శాఖ అధికారి స్వర న్‌సింగ్, తహసీల్దార్ సుగుణ పాల్గొన్నారు.



వేసైడ్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పట్టణాభివృద్ధే ప్రధాన లక్ష్యం

కొత్తకోట రూరల్: కొత్తకోట పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యమని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని 4, 5, 6వ వార్డులలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. 11వ వార్డులో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, మున్సిపల్ కమిషనర్ సైదయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి.కృష్ణారెడ్డి, ఎన్‌జె.బోయేజ్, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



సీసీ రోడ్లుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

గడువులోగా సీఎంఆర్ అప్పగించాలి



రైస్‌మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఖిల్లాఘనపురం: రైతులు పండించిన ధాన్యాన్ని స కాలంలో మిల్లింగ్ చేసి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సీఎంఆర్ బియ్యం పౌరసరఫరాల శాఖకు అప్పగించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అ న్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రం స మీపంలోని శ్రీనివాస, వెంకటేశ్వర, శ్రీరామ రైస్‌మిల్లులను పరిశీలించారు. నిల్వఉన్న ధాన్యం, మిల్లింగ్ చేస్తున్న బియ్యం పరిశీలించారు. మిల్లులకు ఖరీఫ్, రబీ సీజన్లలో ఇచ్చిన ధాన్యం నిల్వలు, సరఫరాపై మిల్లుల యజమానులకు పలు చూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్ర భుత్వం నిర్దేశించిన సమయంలోగ సీఎంఆర్ బి య్యాన్ని కచ్చితంగా పౌరసరఫరాలశాఖకు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాణీ విశ్వనాథ్, జిల్లా మేనేజర్ జగన్మోహన్, డీటి పరమేశ్వర్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు



గోపాల్‌పేట : వివాహిత మిస్సింగ్ అయిందని ఫిర్యాదు రాగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని గోపాల్‌పేట ఎస్సై నరేష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఏదుల మండల కేంద్రానికి చెందిన ద్యావర రాముడికి చంద్రకళతో 15 సంవత్సరాల క్రితం పెళ్ళయింది. అయితే ఈనెల ఏడో తేదీన హైదరాబాద్‌లో ఉన్న తన అన్నలకు రాఖీ కట్టి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్ళింది. ఆ తర్వాత భర్త ఈనెల 13 తేదీ రోజు చంద్రకళ అన్నవాళ్ళకు ఫోన్‌చేసి అడుగగా హైదరాబాద్‌కు రాలేదని చెప్పారు. తెలిసిన వారు, చుట్టాలను అడిగినా రాలేదని చెప్పారు. దీంతో మంగళవారం గోపాల్‌పేట పీఎస్‌లో మిస్సింగ్ అయినట్లు ద్యావర రాముడు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మరో మహిళ మిస్సింగ్..

గోపాల్‌పేటకు చెందిన దయ్యం మశమ్మ సోమవారం ఇంటినుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. మంగళవారం తన కుమారుడు దయ్యం రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని ఎస్సై నరేష్‌కుమార్ తెలిపారు.

మానవతామూర్తి మదర్ థెరీసా



అమరచింతలో నవోదయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో

వనపర్తిటౌన్: నిస్సహాయులకు, నిరుపేదలకు ప్రేమామృతాన్ని దైవదూత, మానవతామూర్తి మదర్ థెరీసా అని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మదర్ థెరీసా జయంతిని మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఉత్తరయ్య, బూరోజు గిరిరాజా చారి, బలేమియా తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మదర్ థెరీసా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఆయన కలిసి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, గిరిరాజాచారి, సంజీవయ్య, వరదాచారి, మహ్మద్‌షఫి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో మదర్ థెరీసా జయంతిని మంగళవారం నవోదయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఎస్ఈ శ్యాంసుందర్ రవికుమార్, లక్ష్మన్న,ఏసన్న, చరణ్, రఘు, ప్రభాకర్ పాల్గొన్నారు.

వృక్షాలే జీవనాధారం..

ఆత్మకూర్: అమ్మపేరిట ఒక మొక్కను నాటి సంరక్షిద్దామని కమిషనర్ శశిధర్, ఎంఈఓ బాలరాజు అన్నారు. మంగళవారం బాలికల పాఠశాలలో ఎకో క్లబ్, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అమ్మపేరిట ఒక మొక్క కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎకోక్లబ్ ఇంచార్జి నాగప్రియ తదితరులు ఉన్నారు.

వంతెన నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరు

మదనాపురం: మండలంలో ఊకచెట్టు వాగు వంతెన పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వ ద్వారా రూ.5కోట్లు ఆర్థిక అనుమతులు వచ్చాయని మండల కాంగ్రెస్ సమన్వయ కమిటీ కో ఆర్డినేటర్ సుక్క మహేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం ఆయన మట్లాడుతూ..ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ మట్టి రోడ్డు నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ద్వారా అనుమతులు వచ్చినందుకు ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ధర్నాను జయప్రదం చేద్దాం

అమరచింత: సెప్టెంబర్ 1న చలో హైదరాబాద్ పేరిట నిర్వహించే సీపీఎస్ వద్దు ఓపీఎస్ ముద్దు అంటూ చేపట్టే మహాధర్నా కార్యక్రమంలో ప్రతిఒక్కరు పాల్గొని విజయవంతం చేయ్యాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాజు కోరారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎస్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గౌస్,హనుమంతు, వెంకటయ్య, యాదయ్య, చంద్రకళ పాల్గొన్నార.

తృటిలో తప్పిన ప్రాణాపాయం

గోపాల్‌పేట: మండల కేంద్రంలో మంగళవారం ఓ దినసరి కూలీ తృటిలో ప్రాణాపాయం నుండి బయటపడ్డాడు. వివరాల్లోకి వెళితే..మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఓ ఇల్లు స్లాబుకు ప్లాస్టరింగ్ పనులు చేసేందుకు దినసరి కూలీలు గోవాలు కడుతున్నారు. ఉన్నట్లుండి ఓ వ్యక్తి పైనుండి పట్టు కోల్పోయి రెండు ఇనుప చువ్వలను పట్టుకుని కిందకు వేళాడాడు.వెంటనే వేలాడుతున్న అతడి కాళ్ళు పట్టుకున్నారు. కానీ అతడికి కిందకు దిగేందుకు అవకాశం లేకపోవడంతో పదినిమిషాల వరకు కాళ్ళు పట్టుకుని ఉన్నారు. చుట్టుపక్కలవారు సహాయ చేసి నిచ్చెన, కర్రలు అతడి కాళ్ళకింద పెట్టి కిందకు దించారు. తృటిలో ప్రాణాపాయం నుండి బయటపడడంతో తీవ్ర భయాందోళనకు గురయ్యాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆత్మకూర్: అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రా క్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి నట్లు ఎస్సై నరేందర్ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రేచింతల ఊకచెట్టువాగునుండి ఇసుకను తరలిస్తున్నారని సమాచారం అందడంతో సోమవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించామని తెలిపారు. ట్రాక్టర్ టీజీ 32 1994, ట్రాలీ టీజీ 32 2863 పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్లు వివరించారు.

పురపాలిక కొత్త ఆటోలు

అమరచింత: మున్సిపాలిటీకి రెండు కొత్త చెత్త సేకరణ ఆటోలు మంజూరు అయ్యాయి. మంగళవారం రెండు కొత్త ఆటోలు మున్సిపల్ కార్యలయంకు చేరుకున్నాయి. రాష్ట్రంలోని 157 మున్సిపాలిటీలలో కేంద్ర ప్రభుత్వం ద్వార ఉచితంగా అందిస్తున్న చెత్త సేకరణ ఆటోల ఎంపికలో వనపర్తి, కరీంనగర్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు మాత్రమే ఎంపికైయ్యాయి. అమరచింత, కరీంనగర్ జిల్లా నుంచి చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీలకు ఆటోలను సీడీఎంఏ డైరెక్టర్ కమీషనర్ టీకే. శ్రీదేవి చొరవతో మున్సిపాలిటీలకు చేరుకున్నాయి.

అభివృద్ధికి నోచుకోని విలీన గ్రామాలు..

వనపర్తి రూరల్: జిల్లాలోని వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆర్‌ఎం రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విలీన గ్రామాల అభివృద్ధిపై మన్సిపాలిటీ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని, ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. ఆయా మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పింఛ న్లు కోసం దరఖాస్తు చేసుకుంటే ఇవ్వడం లేదన్నా రు. కార్యక్రమంలో రాజు, నిక్సన్, మదన్, బాలగౌడ్, రాము పాల్గొన్నారు.

ప్రతిపక్షాల అసమర్థతతోనే హామీలు నెరవేర్చడంలేదు

వనపర్తిటౌన్: ప్రతిపక్షాల అసమర్థతతోనే అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చడం లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని కన్రెమ్మగుడి దగ్గర దివ్యాంగుల, చేయూత పెన్షన్‌దారుల సమావేశాన్ని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో జరిగే మహాగర్జన లోపు హామీలు అమలు చేయకపోతే తీవ్ర పరిణామాలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో గట్టయ్య, పరుషరాముడు పాల్గొన్నారు.

కొంకన్వానిపల్లెను సందర్శించిన వైద్యబృందం

అమరచింత: గ్రామానికి చెందిన 11 ఏళ్ల బాలుడికి డెంగ్యూ జ్వరం సోకడంతో మంగళవారం తిపుడంపల్లి పీహెచ్‌సీ వైద్య బృందం గ్రామాన్ని సందర్శించి దోమల నివారణ కోసం మందులను పిచికారీ చేశారు. అదే విదంగా ఇంటింటికి వెళ్లి రక్త నమూనాలను సేకరించడం జరిగిందని హెల్త్ సుపర్ వైజర్ సురేందర్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎఎల్ఓ టీం సభ్యులు హెల్త్ అసిస్టెంట్స్ గంధం రాజు, సాయన్న, కార్యదర్శి మోహన్, ఎఎన్‌ఎం శారద పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్‌తో ఎంతో ప్రయోజనం

వీపనగండ్ల: అనారోగ్యాలకు గురైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్‌ఫండ్‌తో ఉపశమనం కలుగుతుందని నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ అన్నారు. కల్వరాల గ్రామంలో అరవింద్‌యాదవ్ కుటుంబానికి మంగళవారం రూ.51,500 చెక్కును ఆయన అందజేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో చెక్కులు అందజేసినట్లు ఆయన తెలిపారు. అలాగే గోవర్ధనగిరి గ్రామంలో శంకమ్మకు రూ.18 వేల చెక్కును కాంగ్రెస్ సీనియర్ నా యకుడు వెంకటస్వామి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ భరత్‌చారి, దయాకర్, పెంటయ్య, సుధాకర్‌రెడ్డి, గట్టురాజయ్య, సుబ్రమణ్యం, దర్గేష్, నవీన్‌గౌడ్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న నర్సింహ

స్త్రీ సాధికారితకు చదువే ఆయుధం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఈశ్వరయ్య

వనపర్తి టౌన్: స్త్రీ సాధికారిత సాధించాలంటే చదువే ప్రధాన ఆయుధమని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఈశ్వరయ్య అన్నారు. సమాజంలో నెలకొన్న అనేక సామాజిక అంతరాలకు చదివే చక్కని పరిష్కారం అందిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మహిళా సమానత్వం దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీలు పురుషులతో సమానంగా ఎదిగేందుకు కృషి చేస్తూ అన్ని రంగాల్లో పోటీనిస్తున్నారన్నారు. అయినప్పటికీ గ్రామాల్లో మహిళలపై అనిచివేత కొనసాగుతూ ఉండటం బాధకరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జిసుష్మ, వైస్ ప్రిన్సిపాల్ రామరాజు యాదవ్, అకాడమిక్ కోఆర్డినేటర్ దామోదర్‌రెడ్డి, అధ్యాపకులు పుష్ప, లక్ష్మి, విజయలక్ష్మి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగు



కానాయపల్లిలో ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు



మేళాను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తకోట రూరల్: బోధన-అభ్యసన ఉపకరణాల మేళా కానాయపల్లి గ్రామ పునరావాస కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం విద్యాధికారి కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఎం జి.శ్రీనివాస్‌రెడ్డి, కె.నిర్మలాదేవి, హెచ్‌ఎం భాస్కర్, ఉపాధ్యాయులు ప్రవీణ్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులుతో కలిసి ఎంఈవో కృష్ణయ్య ప్రారంభించారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మేళాకు సహకారాలు అందించినట్లు ఎంఈవో తెలిపారు.కార్యక్రమంలో అమరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, ఉన్నారు.

కొత్తకోట: ఉపకరణాలతో బోధనను సులభతరం చేయవచ్చునని ఎంఈఓ జె.కృష్ణయ్య అన్నారు. మంగళవారం మేళాలో అన్ని పాఠశాలల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొని మొత్తం 128 బోధన అభ్యసన ఉపకరణాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సహాయ సహకారాలు అందజేశారని తెలిపారు.